# బీసీ రిజర్వేషన్లపై ఉద్యమాలే శరణ్యం

## -బీసీ రిజర్వేషన్లపై ఉద్యమాలే శరణ్యం

అమరావతి, అక్టోబర్ 10: బీసీల జనాభాకనుగుణంగా రిజర్వేషన్లు కల్పించడంలో పాలక పార్టీలకు చిత్తశుద్ధి లేదని, అందుకు ప్రత్యక్ష నిదర్శనమే బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం అని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడానికి నిరసిస్తూ ఈ రోజు (శుక్రవారం) వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 56% బీసీలు ఉంటే 42% రిజర్వేషన్లు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా జీవో 9 తీసుకువచ్చి పూర్తి చట్టబద్ధ లేకుండా స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చి న్యాయస్థానంలో నిలబడకుండా చేసిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అగ్రవర్ణాలకు ఇచ్చిన ప్రాధాన్యత బీసీలకు ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. బీసీ రిజర్వేషన్లను రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకుంటున్నారని, తప్ప చిత్తశుద్ధితో పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మాలోత్ సాగర్, నర్ర ప్రతాప్, నంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, గణిపాక ఓదేలు, ఐతమ్ నాగేష్, మహ్మద్ మహబూబ్ పాషా, మాలోత్ ప్రత్యూష, ఎగ్గని మల్లికార్జున్, మాలి ప్రభాకర్, హైమద్, అప్పనపురి నర్సయ్య, నలివెల రవి, మంద అనిల్, రఘుపతి,యాకయ్య తదితరులు పాల్గొన్నారు.




# సెపక్ తక్రా టోర్నమెంట్లో...

కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి సెపక్ తక్రా సబ్ జూనియర్స్ టోర్నమెంట్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లం విద్యార్థిని శిరీష జాతీయ స్థాయికి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి ఆనంద్ తెలిపారు. సెపక్ తక్రా ఆటకు సంబంధించి శిరీష కు తిరుపతి నుంచి కోచ్ ని పాఠశాలకు రప్పించి ట్రైనింగ్ ఇప్పించడం జరిగిందని, శిరీష సెపక్ తక్రా ఆటలో రాణించి పాఠశాలకు జాతీయస్థాయిలో గుర్తి ంపు తీసుకురావడం సంతోషకరంగా ఉందని ఆయన తెలిపారు.

వల్లం పాఠశాల నుండి ఇదివరకే ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచారని, భవిష్యత్తులో మరింతగా ప్రతిభను కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన శిరీషకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంద్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. ఆటల పోటీల్లో శిరీష ప్రతిభ కనబరచడానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయులు వాణి సోమశేఖర్ ని ప్రత్యేకంగా అభినందించారు.

# భారత అతిపెద్ద డిజిటల్ వ్యవసాయ-వాణిజ్య వేదికను బలోపేతం చేసేందుకు 9 కొత్త ఉత్పత్తుల చేరిక

న్యూఢిల్లీ, అక్టోబర్ 10:భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఈ-నామ్) వేదికను బలోపేతం చేస్తూ మరో 9 ఉత్పత్తులను చేర్చింది. ఈ వేదికపై మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల సంఖ్య 247కు చేరింది. మార్కెట్ అనుసంధానంలో భాగంగా వస్తు లభ్యతా పరిధిని పెంచాలంటూ రైతులు, వ్యాపారులు, ఇతర వాటాదారుల నుంచి వచ్చిన డిమాండు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లను కలుపుతూ పారదర్శకంగా, పోటీతత్వంతో కూడిన డిజిటల్ వాణిజ్య వేదికను రైతులు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావటం ద్వారా అవకాశాలను మెరుగుపరచాలని ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.

సంస్థలు, వ్యాపారులు, నిపుణులు, ఎస్ఎఫ్ఏసీతో విస్తృతంగా చర్చించి, ఈ-నామ్ వేదికలోని ఉత్పత్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన వాణిజ్య ప్రమాణాలను మార్కెటింగ్, తనిఖీల విభాగం (డీఎంఐ) రూపొందించింది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహన్ కూడా దీనిని ఆమోదించారు.

వాణిజ్య ప్రమాణాలు ఉండటం వల్ల మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గిపోవడంతోపాటు, రైతు- తన ఉత్పత్తులకు మంచి ధరను పొందగలుగుతాడు. ఈ కార్యక్రమం పారదర్శకమైన వాణిజ్య వ్యవస్థను ప్రోత్సహించటంతో పాటు రైతుల ప్రయోజనాలను కాపాడి, దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక వృద్ధికి తోడ్పడుతుంది.

ఈ-నామ్ వేదికపై క్రయ విక్రయాలు జరుగుతున్న 238 వ్యవసాయ ఉత్పత్తులకు వాణిజ్య ప్రమాణాలను డీఎంఐ రూపొందించింది. కొత్తగా 9 ఉత్పత్తులను చేర్చటం ద్వారా మొత్తం ఉత్పత్తుల సంఖ్య 247కి పెరగటంతో వేదిక పరిధి, ప్రభావం మరింత విస్తృతమవుతాయి. కొత్తగా చేర్చిన 9 కొత్త ఉత్పత్తులు:

వాణిజ్య ప్రమాణాలు.. పంట ఉత్పత్తులకు నాణ్యతా శ్రేణిని, స్థాయిని నిర్ణయించటం వలన ధరలు నాణ్యతతో ముడిపడి ఉంటాయి. దీంతో రైతులు తమ పంటలకు మెరుగైన ధరను పొందుతారు.

తాజాగా ఆమోదించిన వాణిజ్య ప్రమాణాలు ఇప్పుడు ఈ-నామ్ పోర్టల్ లో అందుబాటులో ఉండటంతో ఈ వేదిక పారదర్శకమైన, నాణ్యతా-ఆధారిత మార్కెట్ గా తన పాత్రను మరింత బలపరచుకుంది. ఈ వేదిక ద్వారా రైతులు విస్తృత స్థాయి మార్కెట్లను చేరుకోవటానికి, లాభదాయకమైన ధరలను పొందటానికి, నాణ్యతా ప్రమాణాల ద్వారా ప్రయోజనాలు పొందే వీలుంటుంది. దీంతో రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది.

పారదర్శకమైన డిజిటల్ వేదిక ద్వారా రైతులకు సాధికారత కల్పిస్తూ, నాణ్యతాధారిత వాణిజ్యాన్ని ప్రోత్సహించడంతోపాటు వ్యవసాయ రంగంలో సమ్మిళిత వృద్ధిని పెంచాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని ఇది స్పష్టం చేస్తుంది.

# భారత్, యూకే సీఈటీఏ ప్రయోజనాలను అందించడం, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల బలోపేతం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10:వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ భాగస్వామ్యానికి ఒక కొత్త రూపురేఖలను సిద్ధం చేసే ఉద్దేశంతో ఒక ద్వైపాక్షిక సమావేశాన్ని ముంబయిలో ఈ రోజు నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, యూకే వాణిజ్య మంత్రి శ్రీ పీటర్ కైల్ పాల్గొన్నారు.

భారత్, యూకేల మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) అమలును పర్యవేక్షించడానికి జాయింట్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ కమిటీని (జేఈటీసీఓ) పటిష్ఠం చేయాలని మంత్రులిద్దరూ ఈ సమావేశంలో అంగీకరించారు. దీంతో ఒప్పందం అమలు దిశగా ఒక ముఖ్యమైన అడుగును వేసినట్లయింది.

ఒప్పందాన్ని త్వరగాను, సమన్వయంతోను, ఆశిస్తున్న ఫలితాలను సాధించేదిగా మలచడానికి ఇరు పక్షాలు నిబద్ధతను వ్యక్తపరిచాయి. రెండు దేశాల వాణిజ్య సంస్థలతో పాటు వినియోగదారులు కూడా ఈ ఒప్పంద ఫలితాలను పూర్తి స్థాయిలో అందుకోగలగాలన్నదే దీని ఉద్దేశం.

అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, డిజిటల్ వాణిజ్యం, స్వచ్ఛ ఇంధనం, సేవలు వంటి రంగాల్లో రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకున్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా, 2030 కల్లా ఉభయ దేశాల మధ్య వాణిజ్య స్థాయిని రెట్టింపు చేసుకోవాలన్న ఉమ్మడి ఆకాంక్షను మంత్రులు పునరుద్ఘాటించారు.

సీఈటీఏతో భారీ మార్పు చోటుచేసుకొనే అవకాశం ఉందని మంత్రులు స్పష్టం చేశారు. నియంత్రణ రంగంలో సహకారం, టారిఫేతర సమస్యలను పరిష్కరించడం, సరఫరా వ్యవస్థను ఏకీకరించడంపై శ్రద్ధ తీసుకోవడం వంటి చర్యలతో ఒప్పందం తాలూకు లాభాలను సాధ్యమైనంత అధికంగా ఎలా పొందవచ్చనే అంశంపై వారు చర్చించారు.

వాణిజ్య మంత్రి, డైరెక్టర్ జనరల్ స్థాయిలో జరిగిన ఈ సమావేశం.. మంత్రుల స్థాయి సమావేశానికి ప్రాధాన్యతను తెచ్చింది.

రోజంతా సాగే ఆసక్తిదాయక చర్చలకూ, దూరదృష్టితో కూడిన చర్చలకూ ఈ సమావేశం బలమైన పునాదిని వేసింది.

ద్వైపాక్షిక సమావేశాని కన్నా ముందు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, వినియోగదారు వస్తువులు, ఆహారం, పానీయాలు, విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, నవకల్పన, నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, స్వచ్ఛ ఇంధనం, ఆర్థిక, వృత్తినైపుణ్య, వాణిజ్య సేవలు (వీటిలో ఐటి, ఐటీఈఎస్, విద్య, ఇంజినీరింగ్ కూడా భాగం) సహా ప్రాధాన్య రంగాల్లో అనేక రంగాలవారీ రౌండ్‌టేబుల్ సమావేశాలను కూడా నిర్వహించారు. ఈ చర్చలు భారత్, యూకేల పరిశ్రమ రంగ ప్రముఖులకు ఒక వేదికను సమకూర్చడంతో పాటు, కార్యాచరణకు మార్గదర్శనాన్ని అందించే లోతైన, ఎంతో విలువైన ఆలోచనలనూ అందించాయి.

భారత్-యూకే సీఈఓ ఫోరాన్ని కూడా ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. దీనిలో రెండు దేశాలకు చెందిన వాణిజ్య రంగ ప్రముఖులు వాణిజ్యం, పెట్టుబడి, నవకల్పనలకు కొత్త అవకాశాలను చర్చించేందుకు ముందుకు వచ్చారు. ఇండియా-యూకే దేశాలకు చెందిన పరిశ్రమ రంగ ప్రతినిధుల సహాధ్యక్షతన ఏర్పాటైన ఈ ఫోరమ్.. రెండు పక్షాల ఆర్థిక సహకారాన్ని ఇప్పటితో పోలిస్తే మరింతగా పెంచేందుకూ, విభిన్నరంగాల్లో భాగస్వామ్యాన్ని బలపరిచేందుకూ ఒక ముఖ్య వేదికలా పనిచేసింది. భారత్, యూకేల మధ్య ఆధునిక, పరస్పర ప్రయోజనకర, మన్నిక కలిగిన ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు కలిసి పనిచేయాలన్న నిబద్ధతను ఈ చర్చలు పునరుద్ఘాటించాయి. ఈ దిశగా ఇండియా-యూకే సీఈటీఏ ఇప్పటికే తన వంతుగా తోడ్పడింది.

ప్రపంచ దేశాల వ్యాపార, ఆర్థిక దృక్పథంపై మంత్రులిద్దరూ తమ ఆలోచనలను పంచుకున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత స్థితులు చోటుచేసుకుంటున్నందువల్ల ఆటుపోటులకు తట్టుకొని నిలిచే, విభిన్న సరఫరా వ్యవస్థల్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భారత్ ఒక కీలక అభివృద్ధి ఇంజినుగా మారిందని శ్రీ గోయల్ వ్యాఖ్యానించారు. భారత్‌తో యూకే కుదుర్చుకున్న ఒప్పందం ఇంతవరకు కుదిరిన ఒప్పందాలన్నింటి కన్నా మంచిదని మంత్రి శ్రీ కైల్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం భారతదేశంలోని విశాల మార్కెట్టును బ్రిటిషు వాణిజ్య సంస్థలకు అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు దేశీయంగా వృద్ధినీ, ఉద్యోగాలనూ, సమృద్ధినీ ప్రోత్సాహించడంలో దోహదపడుతుందని ఆయన అన్నారు.

సమావేశం ముగింపు ఘట్టంలో భాగంగా, వాణిజ్య సంబంధ సమగ్ర సదస్సును నిర్వహించారు. దీనిలో ఉభయ పక్షాలకు చెందిన పరిశ్రమ రంగ సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆధునిక, సమ్మిళిత, పరస్పర ప్రయోజనకర వాణిజ్య భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకుపోవడంతో పాటు వృద్ధికీ, పెట్టుబడికీ, నవకల్పనకూ సరికొత్త అవకాశాల్ని అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పాన్ని ఇరు పక్షాలూ పునరుద్ఘాటించాయి.

# ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులేద్దాం..

## -ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులేద్దాం..
## -టెలీ మానస్ ద్వారా అత్యంత నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు
## -దేశంలో ఎక్కడాలేని విధంగా కేంద్రం సహకారంతో సేవలు అందిస్తున్న రాష్ట్రం
## -ఇండ్లాస్ సేవలు ప్రశంసనీయం
## -వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, అక్టోబర్ 10:మానసికంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషిచేద్దామని.. దేశంలో ఎక్కడాలేని విధంగా కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మానసిక ఆరోగ్యానికి భరోసా కల్పించే వివిధ కార్యక్రమాలతో పాటు వైద్య సేవలు అందిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ లో ఇండ్లాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ' అంశంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

తొలుత మంత్రి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులతో కలిసి మెంటల్ హెల్త్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లతో ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 97 కోట్ల మంది వివిధ రకాల మానసిక రుగ్మతలకు గురైనట్లు వెల్లడించారు. మానసిక ఆరోగ్య సమస్యల వల్ల ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు ఏటా ట్రిలియన్ డాలర్లు మేర నష్టం వాటిల్లుతోందన్నారు.

ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ప్రజలు మానసిక ఆరోగ్య సమస్యల బారినపడుతున్నారని.. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో యాంటీనటల్ యాంగ్జైటీ డిజార్డర్‌కు 14-24 శాతం మంది గురవుతున్నట్లు తెలిపారు. మానసిక రుగ్మతలు, ఒత్తిళ్ల వల్ల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయన్నారు. సమాజానికి వెలకట్టలేని వైద్యసేవలందిస్తున్న మానసిక వైద్యులు, క్లినికల్ సైకాలజిస్టుల కొరత వుందని, ఆ కొరత తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని.. ఇండ్లాస్ హాస్పిటల్‌లో క్లినికల్ సైకాలజీ కోర్సులు ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు.

టెలీ మానస్‌తో మానసిక ఆరోగ్య సేవలు

ఏ రాష్ట్రంలో లేని విధంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో టెలీ మానస్ ద్వారా మానసిక ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాలోనూ మెంటల్ హెల్త్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దేశ వ్యాప్తంగా 27 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ఇస్తే మన రాష్ట్రానికి ఒక కేంద్రం వచ్చిందని, విశాఖపట్నంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడ్ అయిందన్నారు. మానసిక ఆరోగ్య రంగంలో నిపుణుల కొరత తీర్చేందుకు కోర్సులు, ప్రవేశాలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సకాలంలో మానసిక రుగ్మతలను గుర్తించి.. సరైన చికిత్స అందించడం ముఖ్యమని, ఈ దిశగా సమష్టి కృషి, భాగస్వామ్యం అవసరమని, మానసిక వైద్య రంగంలో డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి చేస్తున్న కృషిని అభినందిస్తున్నామని, ఆయన అనుభవాన్ని, సేవలను ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర సాకారానికి ఆరోగ్యాంధ్ర కీలకమని, ప్రజలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలు మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడే యోగాపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహించిందని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఇండ్లాస్ డైరెక్టర్ డా. విశాల్.. ప్రజల్లో మానసిక సమస్యలు పెరుగుతుండటానికి కారణాలు, వాటిని ఎదుర్కొంటూ ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తాము ఈ రంగంలో ప్రామాణిక వైద్య సేవలు అందించే దిశగా ముందడుగు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వి.రాధికారెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డా. శ్రీహరిరావు, లండన్‌కు చెందిన ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డా. కృష్ణారెడ్డి, కంటి వైద్య నిపుణులు డా. ఇండ్ల స్వప్న, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఐఎంఏ ? విజయవాడ అధ్యక్షులు డా. హనుమయ్య, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.




# వినియోగదారులు సహకరించాలని వినతి

బ పుత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు, చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో రేపు (శనివారం) పుత్తూరులో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్టు తెలిపారు.

ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పుత్తూరు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ, గ్రామీణ ఏఈలు జై సాయి, భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఈఈ ఆశీర్వాదం, డీఈఈ శంకరయ్య ఆదేశాల మేరకు ఈ పనులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల వినియోగదారులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని, ఈ సమయంలో ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శబరిమలలో బరువు తగ్గిన బంగారు తాపడాలు.. కేరళ హైకోర్టులో విచారణ

కేరళ, అక్టోబర్ 10: కేరళ లోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో గర్భగుడి ద్వారపాలక విగ్రహాలకు అమర్చిన బంగారు తాపడాలు బరువు తగ్గాయి. ప్రస్తుతం కేరళ హైకోర్టులో వీటిపై విచారణ జరుగుతున్నది. బంగారు తాపడాల విషయంలో జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది.

ఇదిలావుంటే 'బంగారు తాపడాల బరువు ఎందుకు తగ్గింది.. అసలు వాటికి ఏమైంది..?' అని జాతీయ మీడియాలో చర్చ జరుగుతున్నది. వివరాల్లోకి వెళ్తే.. శబరిమల గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై ఉన్న బంగారు తాపడాలను మరమ్మతుల కోసం 2019లో తొలగించారు. ఆ సమయంలో వాటి బరువు 42.8 కిలోలు. వాటిని సరి చేయించేందుకు ఉన్నికృష్ణన్ అనే స్పాన్సర్ ముందుకొచ్చారు.

అయితే వాటిని తిరిగి ద్వారపాలక విగ్రహాలకు అమర్చే సమయానికి బరువు కేవలం 38.25 కిలోలకు తగ్గిపోయింది. ఇది వివాదానికి దారితీసింది. ఇదిలావుంటే జాతీయ మీడియా కథనాల ప్రకారం.. తాపడాలను పునరుద్ధరించేందుకు చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ అనే సంస్థకు తరలించాలి. కానీ షెడ్యూల్‌కు భిన్నంగా దాదాపు 39 రోజులు ఆలస్యంగా ఆగస్టు 29న అవి చెన్నైకి చేరుకున్నాయి.

ఈ 39 రోజుల కాలంలో తాపడాలను పలు ప్రాంతాలకు తీసుకెళ్లినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కొట్టాయంలోని ఓ దేవాలయంతోపాటు ఏపీలోని కొన్ని దేవాలయాలకు, బెంగళూరులోని అయ్యస్వామి గుడికి ఆ తాపడాలను తరలించారని సమాచారం. మళయాళ నటుడు జయరామ్ ఇంట్లో జరిగిన ఓ ప్రత్యేక పూజా కార్యక్రమంలో కూడా తాపడాలను పెట్టారని తెలుస్తోంది.

చివరగా మరమ్మతులు పూర్తైన అనంతరం అవి సెప్టెంబర్ 11న శబరిమలకు చేరుకున్నాయి. అప్పటికే వాటి బరువు అనుమానాస్పద రీతిలో తగ్గిపోయింది. యాక్టర్ జయరామ్ ఇంట్లో జరిగిన ఓ పూజా కార్యక్రమంలో తాపడాలను పెట్టినట్టు స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ కూడా ఫేస్ బుక్ పోస్టులో వెల్లడించింది. తమ వద్దకు వచ్చిన తాపడాల బరువు 38.28 కేజీలేనని తెలిపింది.

ఈ నేపథ్యంలో అసలు శబరిమలను వీడిన తాపడాలే స్మార్ట్ క్రియేషన్స్‌కు చేరుకున్నాయా.. లేదా మారిపోయాయా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాపడాలను భద్రపరిచే బాధ్యత ఎవరు తీసుకున్నారన్న దానిపై కూడా ఇంకా క్లారిటీ రాలేదు. కేరళ రాజకీయ పక్షాలు, లిటిగెంట్లు కూడా ఈ అంశాలనే లేవనెత్తుతున్నారు.

1998లో వ్యాపారవేత్త విజయ్ మాల్యా.. శబరిమల గుర్భగుడి కోసం 30 కేజీల బంగారాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ మరుసటి ఏడాది మరో 800 గ్రాముల బంగారం తలుపుల తాపడాల కోసం విరాళంగా దేవస్థానానికి అందింది. ఈ నేపథ్యం లో నాడు అందిన బంగారానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్స్‌ను సేకరించి సీల్డ్ కవర్‌లో సమర్పించాలని కేరళ హైకోర్టు డివిజన్ బెంజ్ ఆదేశించింది. ఈ దిశగా ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.

# రిటైర్ అయి రెండేండ్లు అయినా బెనిఫిట్స్ లేవు..ఈటల ధ్వజం



హైదరాబాద్, అక్టోబర్ 10:ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ పొంది రెండేండ్లు అవుతున్నప్పటికీ కూడా, వారు బెనిఫిట్స్ పొందలేకపోతున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

ఈ దుస్థితికి సీఎం రేవంత్ రెడ్డినే కారణమని ఈటల రాజేందర్ విరుచుకుపడ్డారు.


ప్రభుత్వ ఉద్యోగి రిటైర్మెంట్ పొందిన రోజు కారులో కూర్చోబెట్టి, రిటైర్మెంట్ డబ్బుల చెక్కును ఇచ్చి పంపాలని కేసీఆర్ అన్నాడు. ఈ విషయం మీ అందరికీ తెలుసు. కానీ ఈ కాంగ్రెస్ పాలనలో రెండేళ్లు అయినా, ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేకపోతున్నారు అని ఈటల రాజేందర్ గుర్తు చేశారు.

కొద్ది మంది కమిషన్లు ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ తెచ్చుకుంటున్నరు. కొద్ది మందేమో కోర్టుకు పోయి తెచ్చుకుంటున్నరు

. ఆ దుస్థితి ఏర్పడింది ఇవాళ. ఏమన్న అంటే రాష్ట్రం దివాళా తీసింది అని ప్రభుత్వం అంటుంది. నీవు అధికారంలోకి వచ్చినప్పుడు తెల్వదా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. అనేక వేదికలపై మాట్లాడారు కదా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలవకుండానే హామీలు ఇచ్చారా.. ఆరు గ్యారెంటీలు గురించి ఇవాళ ఎవరు మాట్లాడతలేరు.

హామీల గురించి ఎవరు మాట్లాడుతలేరు. మేనిఫెస్టో గురించి ఎవరు మాట్లాడుతలేరు. ఉన్నవాటిని అమలు చేయండని ప్రజలు అంటున్నరు. ఉన్న పెన్షన్లు సమయానికి ఇవ్వండి దండం పెడుతం అంటున్నరు. ఇది రాష్ట్రంలో నెలకొన్న దుస్థితి అని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ మండిపడ్డారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : డీఈఓ భిక్షపతి



నల్గొండ, అక్టోబర్ 10:విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నల్లగొండ డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండలంలోని చెర్వుఅన్నారం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి కార్డులు, భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న గుణాత్మక విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు తీరుతెన్నులతో పాటు విద్యార్థులచే పాఠ్య పుస్తకాలు చదివించి వారి పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలతో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులను ఇప్పటి నుంచే పరీక్షలకు సిద్ధం చేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థులను దత్తత తీసుకుని ప్రతి సబ్జెక్టులో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా విని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పాఠశాల ఇన్‌చార్జి ఎంఈఓ అంబటి అంజయ్య, అయా పాఠశాలల హెచ్‌ఎం కందాల రమ. ఘనపురం భీమయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నరహరి, పుల్లయ్య, నగేష్ ఉన్నారు.



# రాష్ట్రాల ఐటీ మంత్రులు, ఐటీ కార్యదర్శులతో రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్రమంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా

న్యూఢిల్లీ, అక్టోబర్ 10:ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025 సందర్భంగా కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రాష్ట్రాల ఐటీ మంత్రులు, ఐటీ కార్యదర్శులతో ఉన్నత స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్ర ఎస్. పెమ్మసాని, కార్యదర్శి (టెలికాం) డాక్టర్ నీరజ్ మిట్టల్ కూడా పాల్గొన్నారు.

ఈ సమావేశం డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడానికి, భారతదేశ డిజిటల్ వనరుల లభ్యత వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యం కోసం ఒక విలక్షణ వేదికగా నిలిచింది. అట్టడుగు స్థాయి వరకు అనుసంధానాన్ని మెరుగుపరచడం, గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు 4జీ, 5జీ విస్తరణను వేగవంతం చేయడం, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, జాతీయ డిజిటల్ దృష్టితో రాష్ట్ర విధానాలను సమన్వయం చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ ప్రపంచ డిజిటల్ శక్తిగా భారత్ అవతరించిన విధానాన్ని ప్రస్తావించారు. ఇంటర్నెట్ కనెక్టివిటీ, బ్రాడ్‌బ్యాండ్ లభ్యత, చౌకగా డేటా అందడంలో చోటుచేసుకున్న అపూర్వ వృద్ధిని ఆయన వివరించారు. ఈ మార్పును ముందుకు తీసుకెళ్లడంలో సహకార సమాఖ్య విధానం అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల విస్తరణను వేగవంతం చేయడం, ఉత్తమ పద్ధతులను అవలంబించడం, రైట్ ఆఫ్ వే సంస్కరణలను త్వరగా అమలు చేయడం కోసం కేంద్రంతో సన్నిహితంగా పనిచేయాలని ఆయన రాష్ట్రాలను కోరారు. రాష్ట్రాల స్థాయిలో విజయవంతమైన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా వినూత్న నమూనాలను విస్తరించడానికి పరస్పర అభ్యాసం, సహకారం అవసరమని ఆయన అన్నారు. డిజిటలైజేషన్ ప్రయోజనాలు దేశం ప్రతి మూలలోని పౌరులకు చేరేలా చేయడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

"ప్రపంచ వేదికపై టెలికాం – డిజిటల్ కలయిక, పరికరాల తయారీ రంగాలలో భారతదేశం ఫీనిక్స్ మాదిరి ఎదిగింది. నియంత్రణ స్థాయిని దాటి సులభతరం చేసే స్థాయికి మారడం వరకు ప్రభుత్వ ప్రయాణం ప్రతి పౌరుడికి అత్యంత అవసరమైన కనెక్టివిటీ, సమ్మిళితం, సమానత్వాన్ని అందించడానికి వీలు కల్పిస్తోంది" అని కేంద్ర మంత్రి అన్నారు. "భారత జీడీపీలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వాటా 2029–30 నాటికి 20%కి చేరుకోనుంది. ఈ మార్పు కేవలం కేంద్రం ద్వారానే కాకుండా అన్ని రాష్ట్రాల సమష్టి శక్తితో నడుస్తోంది. సుస్థిర, సమీకృత, భవిష్యత్తుకు-సిద్ధంగా ఉన్న డిజిటల్ సానుకూల వ్యవస్థ కోసం ఈ అవకాశాన్ని మనం కలిసి అందిపుచ్చుకోవాలి" అని కూడా మంత్రి అన్నారు.

కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డాక్టర్ చంద్ర ఎస్. పెమ్మసాని మాట్లాడుతూ, భారత ప్రతిష్ఠాత్మక డిజిటల్ కనెక్టివిటీ లక్ష్యాలను సాధించడంలో రైట్-ఆఫ్-వే (ఆర్ఓడబ్ల్యూ) సంస్కరణల కీలక పాత్రను వివరించారు. కొత్త టెలికమ్యూనికేషన్ రైట్-ఆఫ్-వే రూల్స్ 2025 గురించి పేర్కొన్నారు. వీటిలో సింగిల్ విండో అనుమతులు, నిర్ణీత వ్యవధిలో ఆమోదాలు, ఒకే విధమైన వ్యయ ఆధారిత ఛార్జీలు, మౌలిక సదుపాయాల భాగస్వామ్యం, పట్టణ ప్రణాళికలో డిజిటల్ కారిడార్ల సమగ్రీకరణ ఉన్నాయి. రాష్ట్రాల సమన్వయ చర్యల ఆవశ్యకతను స్పష్టం చేస్తూ, నెట్‌వర్క్ విస్తరణకు ఆటంకాలను తొలగించి, ప్రతి పౌరునికి అధిక నాణ్యత గల డిజిటల్ సేవలను అందించడానికి ఈ సంస్కరణలను వేగంగా అమలు చేయాలని ఆయన ఐటీ మంత్రులు, కార్యదర్శులను కోరారు. నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ 2.0 విజయం రాష్ట్ర స్థాయిలో సమష్టి నాయకత్వం, సకాలంలో అమలు చేయడంపై ఆధారపడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

"మన దగ్గర టెక్నాలజీ ఉందా అని చరిత్ర అడగదు, మనకు సంకల్పం ఉందా అని అడుగుతుంది. నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ 2.0 కింద అందరికీ సార్వత్రిక, చౌక, నాణ్యత గల బ్రాడ్‌బ్యాండ్ అందించాలనే నిబద్ధత మనకు ఉంది. 2025 టెలికమ్యూనికేషన్ రైట్-ఆఫ్-వే నిబంధనలు ఈ లక్ష్యాన్ని సాకారం చేసుకోవడానికి మనకు మార్గాలను అందిస్తున్నాయి" అని డాక్టర్ పెమ్మసాని అన్నారు.

టెలికాం కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ మాట్లాడుతూ, డిజిటల్ మౌలిక సదుపాయాల విజయవంతమైన అమలులో రాష్ట్రాల కీలక పాత్రను వివరించారు. టెలికాం కేంద్ర పరిధిలోని అంశమైనప్పటికీ, దాని అమలు రాష్ట్రాల చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేశారు. రైట్ ఆఫ్ వే, భూ కేటాయింపులు, సైట్ యాక్సెస్ వంటి క్షేత్రస్థాయి సవాళ్లను పరిష్కరించడంలో రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. "క్షేత్రస్థాయిలో రాష్ట్రాల సహకారం లేకుండా ఏమీ జరగదు" అని స్పష్టం చేశారు.

"టెలికాం కేంద్ర పరిధిలోని అంశమైనప్పటికీ, వాస్తవ అమలు రాష్ట్రాల్లోనే జరుగుతుంది. రైట్ ఆఫ్ వే, టవర్ల కోసం భూమి, స్థలంలోకి ప్రవేశం, స్థానిక శాంతిభద్రతలు వంటి సమస్యలకు అత్యంత సమన్వయం అవసరం. రాష్ట్ర మంత్రులు, కార్యదర్శుల నుంచి అభిప్రాయాలను స్వీకరించడానికి, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ప్రతి రంగానికి శక్తినిచ్చే ఒక సమాంతర సాంకేతికతగా టెలికాం రంగాన్ని కలిసి ముందుకు తీసుకెళ్లడానికి ఈ సమావేశం ఎంతో విలువైనది" అని అన్నారు.

అడ్డంకులను గుర్తించడానికి, విధాన రూపకల్పనలో రాష్ట్రాల అభిప్రాయాలను చేర్చడానికి, అన్ని రంగాలలో ఆర్థిక వృద్ధి, అభివృద్ధికి మద్దతు ఇచ్చే డిజిటల్ వ్యవస్థను సమష్టిగా బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర చర్చలకు ఈ రౌండ్‌టేబుల్ సమావేశం ఒక కీలక వేదికను అందించింది. కనెక్టివిటీ ప్రయోజనాలు దేశవ్యాప్తంగా ప్రతి పౌరుడికి చేరేలా ధృఢమైన, సురక్షితమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న డిజిటల్ వ్యవస్థ కోసం సమష్టిగా పని చేయాలనే భాగస్వామ్య నిబద్ధతను ప్రకటిస్తూ సమావేశం ముగిసింది.

# మా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీ చేజారదు -ఉదయనిధి స్టాలిన్

తమిళనాడు, అక్టోబర్ 10:డీఎంకే కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీ చేజారబోదని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అన్నారు. దిండుగల్ సమీపంలోని వేడచెందూర్‌లో శుక్రవారం ఉదయం డీఎంకే ప్రముఖుడు స్వామినాథన్ ఇంట్లో వివాహ వేడుక జరిగింది. ఆ వివాహానికి ఉదయనిధి హాజరై వధూవరులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఉదయనిధి మాటాడుతూ.. అన్నాడీఎంకే ఇప్పటికే బీజేపీకి బానిసలా మారిందని, కొత్త బానిసల కోసం కమలనాథులు వెతుకుతున్నారని వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ బెదిరింపులకు డీఎంకే ఎప్పటికీ భయపడే ప్రసక్తేలేదని, అదేవిధంగా కూటమిలో ఉన్న మిత్రపక్షాలకు ఇచ్చే గౌరవం కూడా తగ్గబోదని అన్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పుడున్న డీఎంకే కూటమి అలాగే కొనసాగుతుందని, కాంగ్రెస్ పార్టీ కూటమి నుంచి బయటికెళ్లే ప్రసక్తే లేదని ధీమాగా చెప్పారు.

ఇక అధిక సీట్లు డిమాండ్ చేస్తున్న మిత్రపక్షాలతో డీఎంకే ఎన్నికల నిర్వహణ కమిటీ చర్చిస్తుందని, కూటమి అధ్యక్షుడైన సీఎం స్టాలిన్ మంచి నిర్ణయం తీసుకుంటారని ఉదయనిధి అన్నారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమే బలమైన కూటమని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి బుధవారం రాత్రి జరిగిన రోడ్‌షోలో వ్యాఖ్యానించారని, వాస్తవానికి ఆ కూటమిలో చేరిన పార్టీలపై ఇప్పటివరకు స్పష్టతలేదని ఎద్దేవా చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : డీఈఓ భిక్షపతి



నల్గొండ, అక్టోబర్ 10: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నల్లగొండ డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండలంలోని చెర్వుఅన్నారం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి కార్డులు, భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న గుణాత్మక విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు తీరుతెన్నులతో పాటు విద్యార్థులచే పాఠ్య పుస్తకాలు చదివించి వారి పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలతో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులను ఇప్పటి నుంచే పరీక్షలకు సిద్ధం చేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థులను దత్తత తీసుకుని ప్రతి సబ్జెక్టులో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు భోదించే పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా విని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పాఠశాల ఇన్‌చార్జి ఎంఈఓ అంబటి అంజయ్య, అయా పాఠశాలల హెచ్ఎం కందాల రమ. ఘనపురం భీమయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నరహరి, పుల్లయ్య, నగేష్ ఉన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

## – సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



ఆదిలాబాద్, అక్టోబర్ 10:విద్యార్థులు, యువతులకు చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. ఈ నెల 11 వ తేదీన అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ , డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

సమాజంలో జరుగుతున్న మోసాలు, దౌర్జన్యాలపై రాజ్యాంగం, కోర్టులు చట్టాలు చేశాయని వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సాయిని రాజశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ , సివిల్ కోర్టు సూపరింటెండెంట్ సుభాష్, రాణి తదితరులు ఉన్నారు.

# వైమానిక దళ దినోత్సవ పరేడ్ 2025

న్యూఢిల్లీ, అక్టోబర్ 10:2025 అక్టోబర్ 08న భారత వైమానిక దళ (ఐఏఎఫ్) 93వ వార్షికోత్సవాన్ని ఘజియాబాద్‌లోని హిందన్‌లోని వైమానక దళ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీఎస్ (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్) జనరల్ అనిల్ చౌహాన్.. ఆర్మీ, నావిక దళాధిపతులు హాజరయ్యారు. వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ కవాతును సమీక్షించారు. కార్యక్రమంలో వైమానిక దళ మాజీ అధిపతులు, సీనియర్ అగౌరవం, గర్వం, ఐక్యత, సామర్థ్యాన్ని తెలియజేసేలా రాష్ట్రపతి పతాకం (ప్రెసిడెంట్స్ కలర్స్) ప్రవేశంతో ఈ కార్యక్రమం ప్రారంభ మైంది. కవాతు వద్దకు వైమానిక దళ చీఫ్ విచ్చేసిన అనంతరం జాతీయ జెండా, ఐఏఎఫ్ జెండా, ఆపరేషన్ సిందూర్ జెండాతో 'ధ్వజ్' రూపంలో మూడు ఎంఐ-17 1వి హెలికాప్టర్లు వైమానిక వందనం సమర్పించాయి. ఈ కవాతుకు జీపీ కెప్టెన్ చేతన్ ప్రదీప్ దేశ్‌పాండే నాయకత్వం వహించారు. సైనికుల కచ్చితమైన, శక్తిమంతమైన పాద కదలికలకు తగ్గట్టు ఉన్న ఎయిర్ ఫోర్స్ బ్యాండ్ దేశభక్తి గీతాలు కవాతుకు ఉత్తేజాన్నిచ్చాయి. కవాతుకు సరిపోల్చుతూ ఆకాశంలో యుద్ధ విమానాల నిర్వహించిన విన్యాసాలు ప్రేక్షకులకు ఆకర్షించాయి. కార్యక్రమానికి హాజరైన వారందరికీ ఇవి శాశ్వత జ్ఞాపకంగా మిగిలిపోనున్నాయి. ఆరు బృంద పతకాలతో (యూనిట్ సైటెషన్స్) పాటు ఆరు విభాగాల్లో యుద్ధ విమానాల పైలట్లకు 97 పతాకాలను సీఏఎస్ అందించారు.

కవాతును ఉద్దేశించి మాట్లాడిన వైమానిక దళ చీఫ్.. సాధారణ ప్రారంభం నుంచి కచ్చితత్వం, వేగంతో సైనిక ఫలితాలను నిర్దేశించగల 'ప్రపంచంలో నాలుగో అతిపెద్ద వైమానిక దళంగా' అవతరించటం వరకు భారత వైమానిక దళం చేసిన అసాధారణ ప్రయాణాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. కచ్చితత్వంతో సాహసోపేతంగా చేసే దాడులు జాతీయ భద్రతలో వైమానిక దాడులకు ఉన్న సరైన స్థానాన్ని పునరుద్ధరిస్తాయన్న ఆయన.. ఆపరేషన్ సిందూర్‌లో భారత వైమానిక దళ పనితీరు పరాక్రమానికి నిదర్శనమని పేర్కొన్నారు. స్వదేశీ సమీకృత ఆయుధాల పనితీరు పట్ల ఐఏఎఫ్ విశ్వాసంతో ఉన్నట్లు గర్వంగా ప్రకటించారు. వాటిని ఉపయోగించటంతో పాటు ఆవిష్కరణ పట్ల ఐఏఎఫ్ నిబద్ధతతో ఉందని తెలిపారు. 'మనం పోరాడినట్లుగా శిక్షణ ఇవ్వటం' అనే సూత్రం ఆధారంగా శిక్షణ, ప్రణాళిక విషయంలో ఈ విధానాన్ని అవలంబిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఒక ఆవిష్కరణల వేదికను కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఐఏఎఫ్‌కు చెందిన వివిధ విభాగాలలోని సైనికుల ఆలోచనలు, వారు రూపొందించిన పరిష్కారాలను ప్రదర్శించారు. దీనితో పాటు గడిచిన సంవత్సర ప్రయాణాన్ని తెలియజేసే ప్రత్యేక ప్రదర్శనను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో సవాళ్లు, విజయాలు, భారత వైమానిక దళం చూపించిన అసమాన అంకితభావాన్ని ప్రదర్శించారు.

ఈ వైమానిక దళ దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన చారిత్రక విమానాల అద్భుతమైన వైమానిక ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చారిత్రక 'టైగర్ మాత్', 'హెచ్‌టీ-2' విమానాల ఉమ్మడి ప్రదర్శన తర్వాత.. చారిత్రక 'హార్వర్డ్' విమానం ఒంటరి ప్రదర్శన చేసింది. ఈ చారిత్రక విమానాల వైమానిక ప్రదర్శన భారత వాయు సేనకు ఉన్న గర్వించదగిన చరిత్ర, దేశానికి చేస్తోన్న నిరంతర సేవకు సాక్షాత్కారంగా నిలిచింది. వైమానిక దళ దినోత్సవ వేడుకల సంప్రదాయ వైమానిక వందనం, ప్రదర్శనలు 2025 నవంబర్ 09న గౌహతిలో నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా సీ-17 గ్లోబ్‌మాస్టర్, ఎస్‌యూ-30 ఎంకేఐ, అపాచీ, మిగ్-29, మిగ్-21 బైసన్, రాఫెల్, ఏఎల్‌హెచ్ ఎంకే-ఎఎత్రీ, ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, సీ-130 జే సూపర్ హెర్క్యులస్, ఆకాష్ మిస్సైల్ వ్యవస్థ, రోహిణి రాడార్ వంటి అత్యాధునిక విమానాలు, పరికరాల ప్రదర్శనను కూడా నిర్వహించారు.

# హైకోర్టు స్టేపై సుప్రీంలో న్యాయ పోరాటం చేయాలి : జూకంటి ప్రవీణ్ కుమార్

నల్గొండ, అక్టోబర్ 10: బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 9పై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలోని గాంధీ కూడలిలో బీసీ నేతలు ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఒక్క శాతం తగ్గినా రాష్ట్రంలో ప్రళయమే సృష్టిస్తామని హెచ్చరించారు.

కోర్టులను అడ్డం పెట్టుకుని బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని కుట్రలు పన్నితే బీసీల ఆగ్రహాన్ని గురికాక తప్పదన్నారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పార్టీలకతీతంగా బీసీలంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, సంధిల భాస్కర్ గౌడ్, దాచేపల్లి రాజు, సూరారం వెంకటేశ్, చిగుళ్ల బీరయ్య, కాకల్ల నవీన్, గౌర బక్కయ్య, వస్పరి సుధాకర్, అఖిలపక్ష నేతలు బొంగోని ఉప్పలయ్య, ఎర్ర గోకుల జస్వంత్, గుర్రం నరసింహులు, ఏమ్మ భాస్కర్, బిర్రు లవన్, గజ్జల రాజు, పాండవుల వెంకటేశ్ పాల్గొన్నారు.

# రైళ్లను పునరుద్ధరించాలని డీఆర్ఎం గోపాలకృష్ణకు వినతి

కారేపల్లి, అక్టోబర్ 10 : కొవిడ్ సమయంలో రద్దైన రైళ్లలో ఇంకా రెండు రైళ్లను నేటికీ పునరుద్ధరించలేదని, ఆ రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి డీఆర్ఎం గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. డీఆర్ఎం గోపాలకృష్ణ కారేపల్లి రైల్వే స్టేషన్‌కు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డోర్నకల్- భద్రాచలం రోడ్, మణుగూరు- కాజీపేట జంక్షన్ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని, అలాగే డోర్నకల్ భద్రాచలం రోడ్ మధ్యలో నడుస్తున్న రైళ్లకు ఈ రైలు మార్గంలో ఉన్న అన్ని స్టేషన్లలో హాల్టింగ్ కల్పించాలని కోరుతూ డీఆర్ఎంకు సురేందర్ రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేందర్ మనియార్, తురక నారాయణ, బిచ్యా నాయక్, తోగర శ్రీను పాల్గొన్నారు.

# 93వ భారత వైమానిక దళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 10:భారత వైమానిక దళం (ఐఏఎఫ్) 93వ వార్షికోత్సవ సందర్భంగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ వైమానిక దళ సిబ్బందికి, మాజీ సిబ్బందికి, అధికారులకు, వారి కుటుంబాలకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వైమానిక శక్తి వ్యూహాత్మక ఫలితాలను ఎలా రాబడుతుందో అనేకసార్లు ఐఏఎఫ్ నిరూపించినదని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ సమయంలో శత్రువుల భూభాగంలోకి ప్రవేశించి కచ్చితత్వంతో దాడి చేసే మన సామర్థ్యాన్ని వైమానిక దళం మరోసారి ప్రపంచానికి స్పష్టం చేసిందన్నారు.

శత్రు విమానాలు, వైమానిక ఆయుధాలు, డ్రోన్‌లను సమర్థంగా గుర్తించి.. వాటిని నిర్వీర్యం చేయడం కోసం గల సంక్లిష్టమైన సెన్సార్లు, రాడార్‌లతో కూడిన ఐఏఎఫ్ నెట్‌వర్క్‌ను సీడీఎస్ ప్రశంసించారు. భారత వాయుసేన విభాగాల మద్దతుతో ఐఏఎఫ్‌కు చెందిన సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణి (ఎస్ఏఎమ్), కౌంటర్-అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ (సీయూఏఎస్) యూనిట్లు.. ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఏసీసీఎస్) ఆధ్వర్యంలో అద్భుతంగా పని చేస్తూ ఆపరేషన్ సిందూర్ సమయంలో సత్ఫలితాలు సాధించాయని ఆయన తెలిపారు. స్వదేశీ ప్లాట్‌ఫారమ్‌లను ప్రారంభించడం, అధునాతన ఆయుధ వ్యవస్థలను అమలుచేయడం, మొత్తం ఏరోస్పేస్ వ్యవస్థ వ్యాప్తంగా అమలయ్యే నియమ నిబంధనలను నవీకరించడం ద్వారా ఆధునికీకరణ దిశగా పురోగమిస్తున్న ఐఏఎఫ్ నిరంతర ప్రయత్నాలను సీడీఎస్ కొనియాడారు.

యుద్ధం పరిణామం చెందే తీరును జనరల్ అనిల్ చౌహాన్ ప్రధానంగా ప్రస్తావిస్తూ.. "యుద్ధ స్వభావం తీవ్రమైన మార్పులకు లోనవుతోంది. భవిష్యత్తులో సంఘర్షణలు సాంకేతికత ఆధారితంగా, మరింత వేగంగా, బహుళ రంగాల్లో పోటాపోటీగా ఉంటాయని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆధునిక యుద్ధాలను గెలవడంలో వైమానిక శక్తి కీలకం కానుంది'' అని అన్నారు. యుద్ధంలోనూ, మానవతా కార్యకలాపాల్లోనూ ధైర్యం, వృత్తి నైపుణ్యం, దేశానికి సేవ చేయడమనే విశిష్ట వారసత్వాన్ని ఐఏఎఫ్ కొనసాగిస్తోందని సీడీఎస్ ప్రశంసించారు.

మానవతా సాయంలోనూ, విపత్తు సహాయ కార్యకలాపాల (హెచ్ఏడీఆర్) సమయంలోనూ నమ్మదగిన తోడుగా అందరి కన్నా ముందుగా ఐఏఎఫ్ రంగంలోకి దిగుతుందని సీడీఎస్ తెలిపారు. "సంఘర్షణ ప్రాంతాల్లో చిక్కుకున్న పౌరులను రక్షించడం ద్వారా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో కీలక సహాయాన్ని అందించడం ద్వారా ఐఏఎఫ్ నిరంతరం విస్తరిస్తున్న తన పరిధిని, వేగవంతమైన స్పందనను ప్రదర్శిస్తోంది" అన్నారు. దశాబ్దాలుగా దేశ గగనతలాన్ని రక్షిస్తూనే.. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పౌరులకూ సహాయం చేస్తూ ఐఏఎఫ్ శౌర్యానికి చిహ్నంగా నిలుస్తోందని సీడీఎస్ వ్యాఖ్యానించారు.


పి వి ఎం ఫౌండేషన్
సర్వార్థ సంక్షేమ సమితి
హైదరాబాద్
ఆహ్వానము
శ్రీ పివి మనోహర్ రావు గారు రచించిన
ఈనాటి ధ్యేయాలు - ఆనాటి గేయాలు
గ్రంథావిష్కరణోత్సవం
తేదీ: 12.10.2025, ఆదివారం సాయంత్రం 5 గం. 30ని.లకు
వేదిక : రవీంద్ర భారతి – సమావేశ మందిరము 1వ అంతస్తు హైదరాబాద్
గాన,నాట్య విభావరి : 5:30 – 6:30 సాయంత్రం
శ్రీమతి స్వేత, చి॥ వేద తదితరులు
ముఖ్య అతిథి : డాక్టర్ కె.వి.రమణా చారి గారు
ఐఏఎస్ రిటైర్డ్ తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు
సభాధ్యక్షులు : ఆచార్య వెల్దండ నిత్యానంద రావు గారు
ఉపాధ్యక్షులు, సురవరం ప్రతాపరెడ్డి తె.వి.వి
ఆత్మీయ అతిథులు : శ్రీమతి సురభి వాణీ దేవి గారు
శాసనమండలి సభ్యులు
శ్రీ పి.వి ప్రభాకర్ రావు గారు
అధ్యక్షులు గ్లోబల్ పీవీ మెమోరియల్ ట్రస్ట్
శ్రీ బి శ్రీనివాస్ రావు
రిటైర్డ్ లెక్చరర్
గౌరవ అతిథులు : ఆచార్య పి గౌరీ శంకర్ గారు
పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
డా. బి.జయ రాములు గారు
పూర్వఇన్చార్జి డీన్ ఓరియంటల్ ఫ్యాకల్టీ,ఓయు
శ్రీ నందూరి బంగారయ్య శర్మగారు
ఆధ్యాత్మికవేత్త
సహకారం : శ్రీ ఉమ్మడి సింగ్ రాఘవరావు గారు(రఘు శ్రీ)
వ్యవస్థాపక కార్యదర్శి మానస ఆర్ట్ థియేటర్స్
స్వాగతం : శ్రీ పీ.వి మదన్‌మోహన్ గారు
సర్వార్థ సంక్షేమ సమితి
వ్యాఖ్యానం : శ్రీ పి మోహన్ కృష్ణ గాంధి గారు
(ప్రముఖ వ్యాఖ్యాత)
వందన సమర్పణ : రఘు శ్రీ
పీ.వి. మదన్ మోహన్
పీవి రాజమోహన్ (కిరణ్)
సర్వార్థ సంక్షేమ సమితి, హైదరాబాద్


# త్వరితగతిన భూ సమస్యలను పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ నగేష్



నిజాంపేట, అక్టోబర్10 : భూ భారతి రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి దరఖాస్తు రూపంలో స్వీకరించిన భూ సమస్యలను సిబ్బంది త్వరితగతిన పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన నిజాంపేట తహసీల్దార్ కార్యాలయంను సందర్శించి సిబ్బంది రిజిస్టర్ల నిర్వాహణ, నిర్వహించే విధుల పట్ల దిశనిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు సైతం పరిష్కర మార్గం చూపాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు ప్రీతి, ఇమాద్, సీనియర్ అసిస్టెంట్ రమేశ్, ఉన్నారు.

# సాదా బైనామాను రద్దు చేయాలని తాసీల్దార్‌కు వినతి



నల్గొండ, అక్టోబర్ 10: చందంపేట మండలంలోని గాజులపురం గ్రామంలో పలువురి రైతులకు సంబంధించిన భూములు అమ్మకపోయినా అమ్మినట్లు తప్పుడు ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తాసీల్దార్ శ్రీధర్ బాబుకు బాధిత రైతులు వినతి పత్రం అందజేశారు. గాగిల్లాపురం గ్రామానికి చెందిన నక్క సంజీవ్ కుమార్ అదే గ్రామానికి చెందిన పలువురి రైతుల పేరిట ఉన్న సుమారు 20 ఎకరాల భూములను తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి సాదా బైనామాలో దరఖాస్తు చేసుకోవడంతో పాటు సంబంధిత రైతులకు నోటీసులు ఇవ్వడం జరిగింది. దీంతో రైతులు రిజిస్ట్రేషన్ ఆపాలని కోరుతూ తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

# జీఎస్టీ సంస్కరణల అమలుకు సహకరించండి

## –కేంద్రీయ వస్తు సేవల పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాల సైదయ్య



కరీంనగర్, అక్టోబర్ 10: (నేటినిజం ప్రతినిధి) జీఎస్టీ సంస్కరణలు పేద మధ్యతరగతి ప్రజలకు ఒక వరం లాంటివని కేంద్రీయ వస్తు సేవల పన్నుల జీఎస్టీ శాఖ కరీంనగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ కే.బాల సైదయ్య అన్నారు.శుక్రవారం స్థానిక ఎల్ఐసి ఏజెంట్ల సంఘ భవనంలో వస్తు సేవల పన్ను అమలకు సంబంధించి పన్ను చెల్లింపు దారులు, ఆడిటర్లు, వాణిజ్య మరియు వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిఎస్టి సంస్కరణలు వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తాయని, రిటైల్ ధరలు తగ్గివినియోగం బలపడుతుందని తెలిపారు. ఇటీవల జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం వస్తు సేవల పన్నుల్లో గణనీయమైన సంస్కరణలు తీసుకువచ్చిన విషయాన్ని బాల సైదయ్య గుర్తు చేశారు.గతంలో ఐదు స్లాబులుగా ఉన్న వస్తు సేవల పన్నులు ప్రస్తుతం మూడు స్లాబులకు తగ్గిపోయాయని తెలిపారు. లగ్జరీ గూడ్స్ మినహా నిత్యవసరాలు అన్ని 0,5,18% స్లాబ్ లోకి వచ్చాయన్నారు.నిత్యవసరాలు, ఎలక్ట్రానిక్ గూడ్స్, సిమెంటు, వాహనాలు, ఆరోగ్యం, విద్య, చేతివృత్తుల ఉత్పత్తులపై పన్ను తగ్గడంతో నిత్యవసర వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావడానికి, ఆర్థిక వృద్ధికి ఊతం ఇవ్వడానికి దోహదపడతాయన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వస్తు సేవల పన్ను సమర్థవంతంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత వ్యాపార వాణిజ్య, సంఘాల ప్రతినిధులపై ఉందని ఆయన అన్నారు. మార్పు చేసిన వస్తు సేవల పన్నుకు విరుద్ధంగా విక్రయాలు జరిగితే వినియోగదారులు సంబంధిత వివరాలను తమ దృష్టికి తీసుకురావచ్చని ఆయన సూచించారు. అలాంటి సందర్భాలలో జీఎస్టీ అమలుకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సవరించిన జిఎస్టి విరుద్ధంగా వ్యాపార లావాదేవీలు నిర్వహించే వ్యాపార వాణిజ్య సంస్థలకు సంబంధించిన వివరాలను తమ దృష్టికి తీసుకురావచ్చని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కేంద్రీయ వస్తు సేవల పన్ను శాఖ పర్యవేక్షకులు పి ఎస్ ఎన్ బాబ్జి, ది శిరీష్ ,గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మరోసారి బీసీలను నిండా ముంచింది

## –బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



కరీంనగర్, అక్టోబర్ 10: (నేటినిజం ప్రతినిధి) స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెల్లని జీవో తీసుకువచ్చి బీసీలను కాంగ్రెస్ నిండా ముంచిందని , రాజ్యాంగబద్ధంగా చేయాల్సిన రిజర్వేషన్ల ప్రక్రియను వదిలి కేవలం ఒక జీవో జారీచేసి డ్రామా చేసిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల విషయంలో జీవో నంబర్ 9పై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శుక్రవారం రోజున గంగాడి కృష్ణారెడ్డి పత్రిక ప్రకటన విడుదల చేశారు.. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన పరిణామాలకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించినప్పుడు కూడా ఆ పార్టీకి రిజర్వేషన్ల పెంపు అంశం సుప్రీంకోర్టు తీర్పును శాసిస్తుందని, . సాధ్యపడదనీ తెలిసీ కూడా కేవలం.. బీసీలను ఏమార్చేలా, వారి ఓట్లను దొంగలించేలా నాటకానికి కాంగ్రెస్ పార్టీ తెరలేపిందనీ విమర్శించారు.అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన సగానికిపైగా హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ గొప్పలు చెప్పి, అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించి మోసం చేసిందన్నారు..కులగణన, బీసీ కమిషన్ నివేదికల ఆధారంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంపు చేస్తామని మాయమాటలు చెప్పిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 31న అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపిందనీ, గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి మూడు నెలల గడువు ఉన్నప్పటికీ, గడువు ముగియకముందే ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం రాష్ట్ర ప్రభుత్వ దురుద్దేశాన్ని బహిర్గతం చేస్తోందన్నారు. ఈ పరిణామాలన్నీ పరిశీలిస్తేకాంగ్రెస్ ప్రతి ఎన్నికకు ముందు డ్రామాకు తెరతీస్తోందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. చట్టపరమైన మార్గంలో కాకుండా, చెల్లని జీవో తీసుకురావడం వలన ఈరోజు బీసీలు న్యాయంగా రావాల్సిన వాటిని కోల్పోతున్నారన్నారు. కోర్టులో నిలవదని తెలిసీ చెల్లని జీవోతో కోటా చెలగాటం ఆడిందన్నారు. ఇది బీసీల ఓట్ల కోసం వేసిన నాటకమే తప్ప సంక్షేమం కోసం చేసిన ప్రయత్నం కాదనీ, ఆరు గ్యారెంటీల లాగే, కాంగ్రెస్ 42% రిజర్వేషన్లపైనా హైడ్రామా చేసిందనీ ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కులగణన, కమిషన్ నివేదిక, జీవోల జారీ?ఈ మొత్తం ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పారదర్శకతను తుంచేసిందని, ఇంటింటి సర్వే అడ్డదిడ్డంగా చేపట్టిందని , అందుకే ఇప్పటివరకు కూడా గణాంకాలు బహిర్గతం కాలేదనీ విమర్శించారు.స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందనీ, అందుకే కుట్ర పూరితంగా అన్ని ప్రక్రియలను వాయిదా వేసి, ప్రజలను గందరగోళానికి గురి చేస్తోందన్నారు. 22 నెలలు గడిచినా బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదనీ, ప్రతీ రోజు కొత్త మాట, కొత్త డ్రామా కాంగ్రెస్ కు అలవాటు అయిందన్నారు. బీహార్‌లో ఓట్లు కొల్లగొట్టడమే కాంగ్రెస్ లక్ష్యం. తెలంగాణ బీసీలకు చట్టబద్ధమైన న్యాయం చేయాలనే చిత్తశుద్ధి లేదు. సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బిల్లు తెచ్చి ప్రజలను మోసం చేసిందని ఆయన ఈ సందర్భంగా తీవ్రంగా మండిపడ్డారు.

# కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి

## –బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్, అక్టోబర్ 10: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరంలోని గాంధీ చౌక్ వద్ద మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి బివియన్ మన హామీలను నెరవేర్చలేదని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన హామీలకు సంబంధించి బాకీ కార్డును ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అందజేశారు.వారి ౦ వెంట మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు , టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు , బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ మాజీ కార్పొరేటర్లు , పలువురు ప్రజా ప్రతినిధులు , బిఆర్ఎస్ పార్టీ నాయకులు పార్టీ డివిజన్ అధ్యక్షులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌సీఎం రూపాంతరణ యాత్రకు విశేష స్పందన




హైదరాబాద్, అక్టోబర్ 9:భారతదేశంలో ప్రముఖ డైరెక్ట్ సెల్లింగ్ కంపెనీ ఆర్‌సీఎం తన 25వ వార్షికోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ గ్రౌండ్స్‌కు వచ్చిన ఆర్‌సీఎం రూపాంతరణ యాత్రకు విశేష స్పందన లభించింది. ఆరోగ్యానికి హానికరం కాకుండా ఆరోగ్యాన్ని ప్రోత్సహించే ఆర్‌సీఎం నాణ్యమైన, ఖర్చు తక్కువ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను ప్రదర్శించింది. హైదరాబాద్‌లో యాత్ర ముగియడంతో ఇప్పటికే ఉన్న అసోసియేట్ కొనుగోలుదారులతో సంబంధాలను బలపరచడమే కాకుండా, కొత్త సభ్యులను తన వేగంగా పెరుగుతున్న నెట్‌వర్క్‌లోకి ఆహ్వానించింది. హైదరాబాద్ ప్రజలు యాత్రను ఎంతో ఉత్సాహంతో స్వాగతించారు. పటేల్ నగర్, నాంపల్లి, హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ సొసైటీ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ వేడుకకు వందలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ ఛాబ్రా మాట్లాడుతూ ఈ యాత్ర కొత్త జీవనోపాధి అవకాశాలు, స్వయం సమృద్ధి దిశగా మార్గం చూపుతుందన్నారు. ఈ యాత్రలో మహిళలు, యువ నాయకులు, సమాజంలో మార్పు తెచ్చిన వ్యక్తుల జీవిత గాథలను ప్రదర్శించామన్నారు. దేశవ్యాప్తంగా 100 రోజులు, 17,000 కిలోమీటర్ల ప్రయాణంలో 75 నగరాలను కవర్ చేస్తూ 25 ఈవెంట్లు నిర్వహిస్తుందన్నారు. ఇది 'స్వస్థ్య (ఆరోగ్యం), సేవా (సేవ), సంస్కార (జీవన విలువలు)' అనే సందేశాన్ని వ్యాప్తి చేస్తుందన్నారు. ఈ ప్రచారం ద్వారా ఇది కేవలం డైరెక్ట్ సెల్లింగ్ సంస్థ మాత్రమే కాకుండా, ప్రజల కేంద్రీకృతంగా, విలువల ఆధారంగా నడిచే ఉద్యమం అన్నది బలంగా చాటుతుందన్నారు. 2000లో స్థాపితమైనప్పటి నుంచి వేల విజయ గాథలను నిర్మించిందన్నారు. గృహిణులు, పదవీ విరమణ చేసిన వారు, యువత, మద్యం వ్యసనాన్ని జయించిన వ్యక్తుల వరకు, ముఖ్యమైన జీవన మార్పు తీసుకువచ్చి గౌరవప్రద జీవితాన్ని తిరిగి నిర్మించుకునే మార్గాన్ని కల్పించిందన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన స్పందన అద్భుతమన్నారు. ఆరోగ్యం, ఆర్థిక అవకాశాలు, బలమైన విలువలతో ప్రతి కుటుంబాన్ని శక్తివంతం చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. స్వస్థ్, వికసిత్ భారత్ వైపు మా ప్రయాణం కొనసాగుతున్నప్పటికీ, ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో మా సంకల్పం అట్టడుగు కాదన్నారు. ఈ సందర్భంగా ఆర్సీఎం మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక అగర్వాల్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో రూపాంతరణ యాత్ర వేడుక ఒక మైలురాయి అన్నారు. ఈ 17,000 కిలోమీటర్ల ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తూ, ప్రతి మహిళకు గౌరవం, బలం, ఆత్మవిశ్వాసంతో జీవించడానికి అవకాశం కల్పించడంలో కట్టుబడి ఉన్నామన్నారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా కొత్త భారత నిర్మాణంలో భాగస్వాములు కావచ్చన్నారు. ఈ సందర్భంగా ఆర్సీఎం సీఈఓ సీఈఓ మనోజ్ కుమార్ మాట్లాడుతూ రూపాంతరణ యాత్రకు హైదరాబాద్‌లో వచ్చిన స్పందన, ప్యాషన్ చూస్తే గర్వంగా ఉందన్నారు. ఈ యాత్ర దేశంలోని కోట్లాది మందిని శక్తివంతం చేస్తూ, రాబోయే తరాలకు స్థిరమైన, సంపన్నమైన భవిష్యత్తు కోసం మార్గం సిద్ధం చేస్తుందని తెలిపారు.

# రామచంద్రాపురంలో పేలిన గ్యాస్ సిలిండర్.. బీటెక్ విద్యార్థి మృతి

మెదక్, అక్టోబర్ 10: రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో విషాదం చోటు చేసుకున్నది. కాలనీలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ మారుస్తుండగా అది ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో ఆనంద్ స్వరూప్ అనే బీటెక్ విద్యార్థి (22) మృతి చెందాడు. సిలిండర్ లీక్ కావడంతో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు.

అయితే ఆనంద్ స్వరూప్ సిలిండర్‌ను మార్చే క్రమంలో ప్రమాద వశాత్తు పేలిపోయిందని అతని తండ్రి భాస్కర్ తెలిపారు. తీవ్రంగా గాయపడటంతో దవాఖానకు తరలించామని, అయితే చికిత్స పొందుతూ చనిపోయాడని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రేమించాలని వేధించిన వాలీబాల్ కోచ్.. డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్, అక్టోబర్ 10: హైదరాబాద్‌లోని లాలాడలో విషాదం చోటుచేసుకున్నది. వాలీబాల్ కోచ్ వేధింపులు తాళలేక డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా దేవాలయంలో సమీ పంలో నివాసం ఉంటున్న మౌలిక (19) అనే యువతి, తార్నాకలోని రైల్వే డిగ్రీ కాలేజీలో సెకండియర్ చదువుతున్నది. అదే కాలేజీలో అంబాజీ అన్నే వ్యక్తి వాలీబాల్ కోచ్‌గా పనిచేస్తున్నారు.

అయితే కొంతకాలంగా తనను ప్రేమించాలని మౌలికను అంబాజీ వేధిస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి.. ఉరివేసుకుని బలవన్మరణం చెందింది. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసులు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# తారామతిపేటలో మొసలి కలకలం..

హైదరాబాద్, అక్టోబర్ 10:హైదరాబాద్ శివార్లలోని రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తారామతిపేటలో మొసలి కలకలం సృష్టించింది. తారామతిపేట నుంచి మూసీ నదిలోకి వెళ్లే కాలువ ద్వారా గ్రామంలోకి మొసలి వచ్చింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మొసలిని బంధించి జూపార్క్‌కు తరలించారు.

# ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టంగా, సమన్వయంతో పనిచేయాలి

## –జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బూత్ స్థాయి సమన్వయం సమావేశంలో రాంచందర్ రావు



హైదరాబాద్ అక్టోబర్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు సంబంధించి భాగ్యనగరంలోని 8 జిల్లాల ప్రధాన నాయకులతో సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, బూత్ స్థాయి సమన్వయం వంటి కీలక అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టంగా, సమన్వయంతో పనిచేసి బిజెపి విజయానికి కృషి చేయాలని రాంచందర్ రావు సూచించారు.బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి, బీసీలకు న్యాయం చేయాలని బిజెపి డిమాండ్ చేస్తోంది.రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని పూర్తి నమ్మకం ఉంది.జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ లోనూ బిజెపి గెలుస్తుంది. ప్రజలు బిజెపిని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారు.గత బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ నగరాన్ని వరల్డ్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పి.. విషాదనగరంగా మార్చింది.ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హైదరాబాద్ నగరంలో అభివృద్ధిని కనుమరుగు చేసింది.వరదల, భారీ వర్షాల సమయంలో ప్రజల అత్యవసర అవసరాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా లోపం స్పష్టమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు. ప్రధాన మార్గాలు, డ్రైనేజీ వ్యవస్థలు, రోడ్ల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తోంది.ఇటీవల తెరిచిన మ్యాన్‌హోల్ ప్రమాదాలతో పిల్లలు మృతిచెందిన ఘటనలు చూశాం.కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతా రాహిత్యంతోనే రామంతపూర్ లో విద్యుత్ షాక్ కు గురై ఆరుగురు మృతిచెందారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేశాయి.కేవలం ఓటుబ్యాంకు రాజకీయాల కోసం మజ్లిస్ తో కలిసేందుకు రెండు పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం జంట నగరాల పరిధిలో నడిచే ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలను పెంచి పేద, సామాన్య ప్రజలపై భారం మోపింది.నాడు బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేశారు. అయినా ఉద్యోగులపై బీఆర్ఎస్ సర్కారు చూపిన కర్కశత్వం తెలంగాణ సమాజం ఇప్పటికీ మరువలేదన్నారు.. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలకు పాల్పడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ప్రకటనలు చేస్తూనే మరోవైపు బస్సు చార్జీలు పెంచడం దారుణం.ఒక చేత్తో ఫ్రీ ఇచ్చి మరో చేత్తో బస్ టికెట్ ధరలు పెంచి సామాన్యులు, పేదలపై భారం మోపడం ఎంతవరకు న్యాయం? ఇటీవల నగరంలో ముస్లిం ఖబ్రస్తాన్ (శ్మశానవాటిక) ఏర్పాటుకు రక్షణ శాఖ భూములను కట్టబెట్టే ప్రయత్నం చేశారు. ఒకవైపు హిందూ దేవాలయాలను కూలగొడుతున్నారు. హిందువులకు రక్షణ లేకపోవడం బాధాకరం.జూబ్లీహిల్స్ అభివృద్ధిపై మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు లేదు.మరో రెండు మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ కు సంబంధించి బిజెపి అభ్యర్థిని ప్రకటిస్తాం.మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న చీకటి సంబంధాలను, చీకటి ఒప్పందాలను ఎండగట్టాలి. బిజెపి నాయకులు, కార్యకర్తలు అందరూ సమిష్టి కృషితో బిజెపిని గెలిపించేలా పనిచేయాలి. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి ని గెలిపించి ప్రధాని నరేంద్ర మోదీ గారికి గిఫ్ట్ గా ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు.

# పురాతన ఆలయాల సంరక్షణ బాధ్యత

## –అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి




కరీంనగర్, అక్టోబర్ 10: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని స్థానిక వావిలాల పల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఉన్న శ్రీరామలింగేశ్వర ఆలయ పునర్నిర్మాణంకుఅల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి రూ.1,16,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూభగవంతుని ఆరాధించడం ద్వారా ఎన్నో శుభ ఫలాలు కలుగుతాయని, ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కూడా అధికంగా సిద్ధిస్తాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. పురాతన ఆలయాలను సంరక్షించవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నదని సూచించారు. ముఖ్యంగా ప్రాచీనమైన ఆలయాలు చాలా శక్తివంతమైనవని, వాటి పరిరక్షణకై ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని సూచించారు. మన భారతదేశంలో అనేక ఆలయాలు ఉన్నాయని ప్రతి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉన్నదని, గంగాధర మండలంలోని వెంకంపల్లిలో గల శ్రీ రామలింగేశ్వర ఆలయం సైతం చాలా ప్రఖ్యాతిగాంచినదని, మహిమాన్వితమైనని వారు గుర్తు చేశారు.ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ అభివృద్ధికై రూ.1,16,000 విరాళం అందజేయడం జరిగిందని, భవిష్యత్తులోనూ ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించేటువంటి పలు కార్యక్రమాలకు సైతం ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. పునర్నిర్మాణం త్వరలో పూర్తికై చొరవ తీసుకోవాలని, భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చి స్వామివారి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి ఆ దేవుని యొక్క ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంద వేణి వెంకట్, సహస్ర జూనియర్ కళాశాలల అధినేత, ఆలయ కమిటీ చైర్మన్ సంకటి శ్రావణ్, పల్మరి సతీష్ యాదవ్, పల్మరి సంపత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అద్భుతమైన కోచర్ రన్‌వే ప్రదర్శనతో అభినవ్ మిశ్రా ఢిల్లీలో కొత్త కలెక్షన్ ది ష్రైన్‌ను ప్రారంభించారు

హైదరాబాద్, అక్టోబర్ 10:అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం, ప్రశంసలు పొందిన కోటురియర్ అభినవ్ మిశ్రా ఛతర్‌పూర్‌లోని పచ్చని తోటలలో, నక్షత్రాల కింద అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తన వార్షిక కోచర్ రన్‌వే ప్రదర్శనలో ది ష్రైన్‌ను ఆవిష్కరించారు. ఒక మైలురాయిగా నిలిచిన ఈ కార్యక్రమంలో మిశ్రా మ్యూజ్, షోస్టాపర్‌గా నిలిచిన సారా అలీ ఖాన్ ర్యాంప్ వాక్‌తో రెండవసారి ఆకర్షణగా నిలిచారు. రన్‌వేపై తన మొట్టమొదటి తోబుట్టువుల ప్రదర్శనలో ఆమె సోదరుడు ఇబ్రహీం అలీ ఖాన్ కూడా చేరారు.అభినవ్ మిశ్రా ప్రతి ప్రదర్శన ఒక అద్భుత దృశ్యం. ది ష్రైన్ దీనికి మినహాయింపు కాదు. మార్గనిర్దేశక రన్‌వే అనుభవాలను సృష్టించడంలో గుర్తింపు దక్కించుకున్న మిశ్రా, రాత్రిని ఒక సజీవ కళాఖండంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. అలంకరణ ప్రేరణతో రాణి పింక్ పరిపూర్ణతను తీసుకువచ్చారు. రాత్రి ఆకాశం కింద, ఆ జంట రాతితో చెక్కిన కలలా, నిశ్శబ్ద వైభవంలో పైకి లేచేలా నిర్మించిన మెట్ల బావిలా, అనంతంలోకి దిగుతున్న టెర్రస్‌లా విప్పారింది. ప్రతి స్థాయి అద్దాల కాంతిలో ఆవరించి, శతాబ్దాల గుసగుసలాడే కథలను ప్రతిధ్వనించింది.సారా, ఇబ్రహీం అలీ ఖాన్ మొట్టమొదటిసారి కలిసి నడుస్తూ కళాత్మకత, చేతిపనులు, కోచర్ ఆనందపు వేడుకలను ఆచరించుకునేందుకు కలిసి వచ్చారు– ఇది సంప్రదాయాన్ని ఆధునికతతో, భావోద్వేగంతో వ్యక్తీకరణతో ఏకం చేసే అభినవ్ మిశ్రా ప్రపంచానికి పరిపూర్ణ ప్రతిబింబం.సారా అలీ ఖాన్ రస్టీ నారింజ రంగులో రాయల్ సమిష్టిలో, అభినవ్ మిశ్రా సిగ్నేచర్ మిర్రర్ వర్క్, సీక్విన్స్, జరీ మరియు రేషమ్‌లతో చేతితో ఎంబ్రాయిడరీ చేయబడి, మెరిసే క్రిస్టల్ అంచులతో పూర్తయి ఉండేలా డిజైన్ చేశారు. మొఘల్ పుణ్యక్షేత్రాల నిర్మాణ అంశాలతో ప్రేరణ పొంది, కలెక్షన్ భావన అయిన ది ష్రైన్‌కు అనుగుణంగా, లుక్ వాస్తవికతను, ప్రకాశాన్ని వెదజల్లింది– కాలాతీత చేతిపనులకు ఆధునిక నివాళి.ఇబ్రహీం అలీ ఖాన్ ఎర్తీ గోల్డ్ కటాన్ సిల్క్‌లో రాజ షేర్వానీ ధరించాడు. అద్దం పని, పట్టు మరియు జరీలతో సంక్లిష్టంగా ఎంబ్రాయిడరీ చేశారు. ఆ లుక్ బోల్డ్ మరియు గ్రాండ్‌గా ఉంది. మిశ్రా వేడుక, వైభవం పట్ల అతని నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. తన సంక్లిష్టంగా అలంకరించబడిన కుర్తాలకు ప్రసిద్ధి చెందిన డిజైనర్ కోసం అరుదైన సిల్హౌట్, షేర్వానీ అతని పురుషుల దుస్తుల కలెక్షన్‌కు గంభీరమైన కొత్త కోణాన్ని తీసుకువచ్చింది.ప్రదర్శన గురించి అభినవ్ మిశ్రా మాట్లాడుతూ: "నా దృష్టిలో ది ష్రైన్ అనేది పవిత్రమైన ప్రతిదానికీ ఒక రూపకం– మన చేతిపనులు, మన కథలు, మన స్వంత భావన. ఇది కార్వింగ్ చేసిన స్తంభాలు, వాడిపోతున్న ఫ్రెస్కోలు, అద్దాల గోడలు – తరాల జ్ఞాపకాలను మోసే వస్తువుల ద్వారా ప్రేరణ పొందింది. ఈ కలెక్షన్, ఆ చరిత్ర నిశ్శబ్ద వేడుకగా భావించాలని, మృదుత్వం, మెరుపును ఆత్మ భాషలో తిరిగి చెప్పబడాలని నేను కోరుకున్నాను" అని తెలిపారు.

# చేనేత కార్మికులకు లయన్స్ క్లబ్ అవగాహన




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్10 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని చేనేత వస్త్ర పరిశ్రమ కేంద్రాల్లో కార్మికుల జీవన విధానంలో మార్పులు, మానసక స్థితిగతులపైవేములవాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేనేత కార్మిక సిరిసిల్ల జిల్లా సైకాలజిస్ట్ పురుషోత్తం ఈశ్వర్ చే శుక్రవారం అవగాహన కల్పించచారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ చీకోటి సంతోష్, రాజన్న లయన్స్ క్లబ్, అధ్యక్షుడు కొలిపాక నర్సయ్యలు మాట్లాడుతూ చేనేత కార్మికులు రెక్క ఆడితే గానీ డొక్కాడని పరిస్థితులు ఉంటాయని, చాలామంది చేనేత కార్మికులు మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న తరుణంలో లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చేపట్టిన అవగాహన సదస్సుచేనేత కార్మికుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండడానికి తోడ్పడుతుందని అన్నారు. మానసిక బలం పెంచే విధంగా వారి ప్రసంగాలతో చేనేత కార్మికులు వారి జీవితాల్లో విలువైన మాటలు విన్నందుకు నూతన ఉత్తేజం ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి వస్త్ర పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్, డాక్టర్ కోహినేని ప్రవీణ్, సైకాలజిస్ట్ ఈశ్వర్, పురుషోత్తం, కొక్కోల రాజు, వస్త్ర పరిశ్రమ అధ్యక్షులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com